- : www.aknu.edu.in
- : nannayavani@aknu.edu.in
- : nannayanewstv
- : Adikavi Nannaya University
- : 9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్


గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 47 | 12-09-2022 | పుటలు : 4


## మంచి మాట





మంచి దేశాన్ని నిర్మించాలంటే - ముందు మంచి పౌరుల్ని తయారు చేయాలి.

- భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య

## 12న నన్నయలో కెమిస్ట్రీ విద్యార్థులకు ప్లేస్మెంట్ డ్రైవ్

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం ప్రాంగణంలో ఈ నెల 12వ తేదీన ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. శుక్రవారం దీనికి సంబంధించిన వివరాలను ఆయన తెలియజేశారు. యూనివర్సిటీ ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన ప్లేస్మెంట్ డ్రైవ్ ను నిర్వహిస్తున్నామని అన్నారు. హెట్రో డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ నక్కపల్లి వారు నిర్వహిస్తున్న ఈ ప్లేస్మెంట్ డ్రైవ్ లో క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ అసెస్మెంట్, కెమిస్ట్రీ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ మరియు ప్రొడక్షన్ కెమిస్ట్ వంటి ఉద్యోగాలు ఉన్నాయన్నారు. బీఎస్సీ కెమిస్ట్రీ, ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎనలిటికల్ కెమిస్ట్రీ, ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ, ఫార్మసిటికల్ కెమిస్ట్రీ విద్యార్థులు ఈ ప్లేస్మెంట్ డ్రైవ్ కు అర్హులన్నారు. అర్హత ఆసక్తిగల విద్యార్థులు 12వ తేదీ ఉదయం యూనివర్సిటీలోని కెమిస్ట్రీ విభాగంలో యూనివర్సిటీ ప్లేస్మెంట్ ఆఫీసర్ డా.బి.జగన్మోహన్ రెడ్డి, డా.కె.దీప్తి లను సంప్రదించాలని తెలియజేశారు.

# నన్నయలో ఘనంగా గురుపూజోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం యూనివర్సిటీ సెమినార్ హాల్ లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు, గౌతమీ నేత్రాలయం అధినేత డాక్టర్ వి.కె.రాజు హాజరై సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లా డుతూ భారతదేశంలో గురువుకు అత్యున్నత స్థానం ఉందని అన్నారు. ప్రాచీన కాలం నుండి మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ అంటూ పూజిస్తున్నారని తెలియజేసారు. గురువులకు విశ్రాంతి ఉండదని, గురువు ఎప్పటికీ గురువేనని,నిరంతరం సమాజ శ్రేయస్సు కోసం విజ్ఞానాన్ని పంచిపెట్టే వారే గురువులని అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి వారిని ఆదర్శంగా తీసుకొని గురువులు మరిన్ని సమజహితమైన కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అధ్యాపకులు కోవిడ్ కాలంలో కూడా ఆన్లైన్ మాధ్యమాల ద్వారా విజ్ఞానాన్ని వికసింపచేసారని చెప్పారు. వందకు పైగా వెబినార్లు, వర్క్ షాప్ లు, ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్ నిర్వహించి ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ను యూనివర్సిటీకి అందించారన్నారు. అదే స్ఫూర్తితో విశ్వవిద్యాలయ అధ్యాపకులు విద్య, విజ్ఞానం, పరిశోధనలు, ప్రోజెక్టులు, కోలబ్రేషన్స్ వంటి కార్యక్రమాలను నిర్వహించి విశ్వవిద్యాలయ అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేయాలనే విజన్ ప్రతీ అధ్యాపకునికి ఉండాలని తెలియజేసారు. గౌతమీ నేత్రాలయం అధినేత డాక్టర్ వి.కె.రాజు మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అధ్యాపకులందరికీ గురుపూజోత్సవ శుభాకాంక్షలను తెలియజేసారు. ప్రపంచంలోనే యువత ఎక్కువ ఉన్న భారతదేశం ఎంతో శక్తివంతమైన దేశమని అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ పుస్తకాలు సమాజానికి ఎంతో ఉపయోగమని వారిని ఆదర్శంగా తీసుకొని అధ్యాపకులు పని చేయాలన్నారు. విద్యరంగంలో పని చేస్తున్నవారు కష్టంగా కాకుండా ఎంతో ఇష్టంగా పని చేయాలని సూచించారు. విద్యార్థులు కూడా ఇష్టంతో చదివితే కష్టమనిపించదని మంచి ఫలితాలు వస్తాయన్నారు. సభాధ్యక్షులు రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, గౌతమీనేత్రాలయం లీలారాజులు గురుపూజోత్సవ శుభాకాంక్షలను తెలియజేసారు. విశ్వవిద్యాలయంలో పరిశోధనలు, ప్రచురణలు, పెటేంట్స్ లలో ప్రతిభ కనపరుస్తున్న కంప్యూటర్ సైన్స్ ఆచార్య పి.సురేష్ వర్మ, ఫిజిక్స్ కోర్సు కోఆర్డినేటర్ డా.ఎస్.రాజ్యలక్ష్మీ, ఫిజిక్స్ అధ్యాపకులు తాడేపల్లిగూడెం డా.కె.ఎఫ్రాయిము బాబు లను వీసీ సన్మానించి అభినందించారు. అనంతరం విశ్వవిద్యాలయం తరపున అతిథులను సన్మానించారు. ఈకార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్రాంగణ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

## మేనేజ్మెంట్‌లో శ్రావ్యకు పిహెచ్.డి అవార్డు


పిహెచ్.డి అవార్డును అందిస్తున్న వీసీ జగన్నాథరావు


ఆదికవి నన్నయ యూనివర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ లో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (Ph.D)ని ఎస్.శ్రావ్య పొందారని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తెలిపారు. యూనివర్సిటీ వీసీ కార్యా లయంలో ఉపకులపతి జగన్నాథరావు చేతుల మీదుగా పిహెచ్.డి అవార్డును శ్రావ్య అందుకున్నారు. ఈ సందర్భంగా వీసీ వివరాలను తెలియజేస్తూ డిపార్టమెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ లో ఎస్.శ్రావ్య పిహెచ్.డి పూర్తి చేసారని చెప్పారు. "ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వస్త్రాల కొనుగోలులో సోషల్ మీడియా మార్కెటింగ్ పాత్ర" అనే అంశంపై డా.ఎన్.ఉదయభాస్కర్ మార్గదర్శకత్వంలో పరిశోధన చేసారని అన్నారు. పూర్తి స్థాయి పరిశోధన విద్యార్థిగా చక్కని పరిశోధన చేసిన ఎస్.శ్రావ్యను వీసీ అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, విభాగాధిపతి డా.పి.ఉమామహేశ్వరి శ్రావ్యను అభినందించారు.

## స్పృహ అభినందన


వీసి ని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా, నన్నయ విశ్వవిద్యాలయం "స్పృహ" సైకాలజీ పూర్వ విద్యార్థుల సంఘం తరపున అధ్యక్షులు సుంకర నాగేంద్ర కిషోర్, డైరెక్టర్లు గూడూరి రాధిక, నల్లమిల్లి అమ్మిరాజు, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మొక్కా జగన్నాథరావుని విద్యావ్యాప్తికి విశిష్ట సేవలందిస్తున్న శాస్త్రవేత్త, విద్యావేత్తగా ప్రత్యేక ప్రసంసా జ్ఞాపిక పురస్కారం,శాలువాతో సన్మానం చేశారు.స్పృహ సైకాలజీ అలుమ్ని వివిధ కార్యక్రమలను చేస్తుందని ప్రశంసలు తెలియచేసి, భవిష్యత్తులో విద్యార్థులకి ఉపయుక్త సైకాలజీ సేవలు అందించాలని వి.సి.సూచించారు.

## సంపాదకీయం



# హృదయ గవాక్షాలు

సర్వేంద్రియానాం నయనం ప్రధానం! ఇది అందరికీ తెలిసిన మాట. ఈ ప్రపంచం ఎలా ఉందో మనకు చూపిస్తున్నది కన్నే కదా! పురాణాల్లో రికార్డయిన మొదటి కంటి ఆపరేషన్ తిన్నడు కథలో ఉంది. శివలింగానికి కళ్ళనిచ్చి కన్నప్ప అయ్యాడు. అంతేనా.. శివలింగం కంటిలో ఆకుపసరు కూడా పోశాడు. కన్ను మీద చాలా చిట్కాలు ప్రయోగించాడు. వాటి ఆధారాలన్నీ ధూర్జటి రచనలో ఉన్నాయి.

పుట్టు గ్రుడ్డివాడైన ధృతరాష్ట్రునికి కృష్ణుడు కంటిచూపు ప్రసాదించాడు. ఇది రెండవ ఆపరేషన్. ధృతరాష్ట్రుని పెళ్లి చేసుకుని గాంధారి తన కన్నులకు పటం కట్టుకుంది. ఇదొక విచిత్రమైన సంఘటన. ప్రేయసి కళ్ళ మీద ప్రేమతో ధనుర్దాసు ఆమె నేత్రాలకు ఎండ తగలకుండా గొడుగు పట్టాడు. కళ్ళు లేకపోతే ప్రపంచంలో ప్రేమ కథలే లేవు. ఆ మధ్య ఒక సినిమాలో హీరో కత్తులతో కాదు కంటి చూపుతో చంపేస్తానన్నాడు. అది ఎలాగో మరి కంటి డాక్టర్లే దానికి సమాధానం చెప్పాలి.

మిల్టన్ మహాకవి గ్రుడ్డివాడు. అద్భుతమైన కవిత్వం రాశాడు. ఇది ఎలా సాధ్యమైందని అడిగారు. నా కన్నులకు "లోచూపు" ఉందన్నాడు. ఆ లోచూపునే గుంటూరు శేషేంద్రశర్మ 'కవికన్ను ఒక ప్రిజమ్' అన్నారు."సత్కవీశుని భావలోచనము ఎరువుగా
బడయకున్న కాంచనేరవు
అంతర్లీన కాంతిసరణి" అంటారు దువ్వూరి రామిరెడ్డి. మనిషికి లోచూపు, భావలోచనం చాలా అవసరం.చాలా విషయాల్ని లోతుగా గమనించడానికి అటువంటి దృష్టి అవసరమే.

శ్రీశ్రీ "ఐ" అని కవిత రాశాడు. ఐ అంటే నేను. ఐ అంటే కన్ను. కవి కన్ను ముఖ్యమైంది. కన్నుల్లో నీ బొమ్మ చూడు... అనే చాలాకాలం నాటి సినిమా పాట దగ్గర్నుంచి నిన్నటి "కన్నులతో చూచేదీ గురువా కనులకు సొంతమునా...." పాట వరకు సినీ కవులు మనకు కన్నుల పండుగ చేశారు. "ఉపాధ్యాయులకు నిత్యమూ సన్మానమే! విద్యార్థులు తమ చూపుల శాలువాలను కప్పుతారు" అంటారు నానీల పుస్తకంలో ఆచార్య ఎన్.గోపి.

"దో ఆంకే బారాహత్"శాంతారాం సినిమా. రెండు కళ్ళు పన్నెండు చేతులు. వ్యక్తి మానసిక పరివర్తనకు సంబంధించిన సినిమా అది. యండమూరి ఒక చోట రాసిన మాట "ఒక కన్నీటి బిందువును వేయి చేతులు తుడవగలగాలి" అని. వ్యక్తికి కావలసిన సేవాభావమది.

దృష్టికి సంబంధించి ఐ డ్రాప్స్, కంటి ఆపరేషన్లు ఉన్నాయి. కానీ చూసే చూపే సరిగ్గా లేకపోతే, దృష్టి కోణమే దోష భూయిష్టమై ఉంటే... కన్ను కాశ్మీరాన్ని చూస్తున్నప్పుడు మనసు కన్యాకుమారిని చూడకూడదు. రెండు కళ్ళు, మనసు, హృదయం ఒకే ఆలోచనను, ఉన్నతమైన దృష్టిని కలిగి ఉండాలి. ఎందుకంటే మన నేత్రాలు మన మనోభావాలకు మహాభాష్యాలు. మన చూపు మనమేంటో తెలియజేస్తుంది. "కన్నులు మన హృదయ గవాక్షాలు" అంటారు షేక్స్పియర్. నిర్మలమైన మనసుతో, స్వచ్ఛమైన దృష్టిని కలిగి ఉండటానికి ప్రయత్నించడమే మనం చేయగలిగిన పని.

# నన్నయ టి.పి.గూడెం క్యాంపస్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**తాడేపల్లిగూడెం –** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, ఫార్మసీ విభాగం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మరియు గొప్ప పండితుడు అయిన భారతదేశ రెండవ రాష్ట్రపతి డాక్టర్ సర్వపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవం అన్ని విద్యా సంస్థలకు ఒక ముఖ్యమైన సందర్భం మరియు ప్రసిద్ధ మరియు విద్యను ప్రోత్సహించే వారి కృషి మరియు బోధనలను గౌరవిస్తుంది. ఉపాధ్యాయుల మనస్సును మరియు హృదయాన్ని మేల్కొల్పిన జ్ఞానాన్ని స్ఫూర్తిగా మరియు ఉదాత్తమైన ఆత్మను గౌరవించడానికి ఈ రోజు భారతదేశం అంతటా గుర్తించబడింది. ఈ వేడుకలకు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్



కె. శ్రీరమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మరియు గౌరవ అతిథిగా జీ టీవీ సరిగమప ఫేమ్ సాయి సంవిద్ పాల్గొని విద్యార్థులను పాటలతో ఆస్వాదించారు. విద్యార్థులందరూ చురుగ్గా పాల్గొని ఉపాధ్యాయులను సన్మానించారు.

# ఆక్వాకల్చర్‌కు అలుమ్ని సహకారం

యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, డిపార్ట్మెంట్ ఆఫ్ లైఫ్ సెన్సెస్ లో ఆక్వాకల్చర్ పూర్వ విద్యార్ధి వినోద్ ప్రస్తుతం విర్బాక్ ఆక్వాకల్చర్ కంపెనీలో ఫీల్డ్ ఆఫీసర్ పని చేస్తున్నారు. వినోద్ సెప్టెంబర్ 5 న గురుపూజోత్సవం సందర్భంగా ఆక్వా కల్చర్ విభాగంలో విద్యార్థుల తో ఆక్వాకల్చర్ ఫీల్డ్ ఎక్స్పీరియన్స్ షేర్ చేసుకున్నారు. ఆక్వాకల్చర్ విభాగానికి వాటర్ అనాలసిస్ కిట్ అందచేశారు. నీటి నాణ్యతను ఎలా పరిశీలన చేయాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాటర్ అనాలసిస్ కిట్ తో వాటర్ అనాలసిస్ చేసి చూపించారు. ఆక్వా కల్చర్ విభాగాధిపతి ప్రొఫెసర్ కె. రమనేశ్వరి అలుమ్ని విద్యార్థికి అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఆక్వాకల్చర్ అధ్యాపకులు డా.డి. శ్రీధర్ పాల్గొన్నారు.



# కాకినాడ క్యాంపస్‌లో గురుపూజోత్సవం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం.ఎస్.ఎన్. క్యాంపస్ కాకినాడ నందు డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. క్యాంపస్ సెమినార్ హాల్లో సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలవేసి ప్రాంగణ అధ్యాపకులు నివాళులర్పించారు. ప్రతి డిపార్ట్మెంట్ లో విద్యార్థులు తమ గురువులను సత్కరించారు. ఈ సందర్భంగా క్యాంపస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. కమలకుమారి ఆధ్వ ర్యంలో ఉపాధ్యా యులకు వివిధ క్రీడా పోటీలను నిర్వహించారు. క్రీడల వల్ల ఉత్తేజ ఉత్సాహం మానసిక ప్రశాంతత కలుగుతాయని కమల కుమారి పేర్కొన్నారు.



# గూడెం క్యాంపస్‌లో సోలార్ పవర్‌తో ఆవిష్కరణలు



ఆదికవి నన్నయ యూనివర్సిటీ తాడేపల్లిగూడెం క్యాంపస్ లోని ద్వితీయ సంవత్సరం ఫిజిక్స్ విద్యార్థులు సోలార్ పవర్ తో పనిచేసే సెల్ఫోన్ ఛార్జర్, సోలార్ పవర్డ్ ఫ్లడ్ వార్నింగ్ సిస్టమ్, సోలార్ పవర్డ్ స్మార్ట్ బిన్ ను తయారు చేశారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. శ్రీరమేష్, కోర్సు కోఆర్డినేటర్ డా. కె. ఎఫ్రాయిము బాబు, డా. కె. వివిఎస్ఎన్ రాజు, జి సత్యనారాయణ ఈ ప్రాజెక్టులను పర్యవేక్షించారు. సృజనాత్మకతతో రూపొందించిన ప్రాజెక్టులకు సంబంధించి విద్యార్థులను అభినందించారు.

# భారత జాతిరత్నం మోక్షగుండం



భారతజాతి ముద్దుబిడ్డ మోక్షగుండం
జాతిమెచ్చిన భారతరత్నం
సాంకేతిక పరిజ్ఞానంలో తిరుగులేని శక్తిగా ఎదిగి
ఇంజనీరింగ్ లో ఉన్నత శిఖరాలను అధిరోహించి
ప్రపంచ ఖ్యాతినొందే నిర్మాణాలను సాగించి
అద్భుతమైన విజ్ఞానాన్ని పంచి
దేశ ఖ్యాతిని నలుదిశలా వ్యాపింపజేసి
ఇంజనీరింగ్ టెక్నాలజీలో ధ్రువతారగా నిలిచిన శాస్త్రవేత్త.
చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన
దుఃఖాన్ని దిగమింగుకుంటూనే ..
లక్ష్యాన్ని చేరుకునే తపనతో చదివాడు
పూణేలో ఇంజనీరింగ్ పట్టానందుకున్నాడు
ఉపకార వేతనంతో డిగ్రీని పొంది,
బొంబాయిలో ప్రభుత్వ ఉద్యోగంలో చేరి ఏడాదిలోనే ఉన్నత స్థాయినందుకున్నాడు.
దేశాభివృద్ధిలో భాగం పంచుకున్నాడు.
అనేక ప్రాజెక్టులు, బ్యారేజిలు రూపొందించి
మైసూర్ దివాన్ గాను సేవలందించాడు.
హైదరాబాద్, ముంబాయి నగరాలకు నగిషీలు చెక్కి
మైసూరును ఆదర్శ నగరంగా ఆధునీకరించి
బృందావన్ గార్డెన్ ని ఆహ్లాదపరచేలా ఆకృతినిచ్చి
విశాఖ పోర్టుకు ఓ రూపునిచ్చాడు
ఇంజనీరింగ్ రంగంలో అందించిన సేవలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గౌరవం 'భారత రత్న' .
సెప్టెంబర్ 15 పుట్టిన ఓ భారత రత్నమా ..
నిపుణతలో విశ్వవ్యాప్తమైన ఓ విశ్వేశ్వరయ్య
ఇంజినీర్ల దినోత్సవం అయింది మీ జయంతి!
నేటి యువతకు ఆదర్శం కావాలి మీ స్వయం కృషి !!

- ఎం.వి.రమణ గంధం, రాజానగరం

# ఉపకులపతి ఉవాచ

## శుభాకాంక్షలు!!



వారసత్వంగా ఎంత సంపద లభించినా అది ఉంటుందో, లేదో తెలియదు కానీ అక్షర జ్ఞాన సంపద లభిస్తే మాత్రం అది శాశ్వతమౌతుంది. దానిని దొంగలు దోచుకోలేరు, దొరలు ఎత్తుకెళ్ళనూ లేరు, పైగా అన్నదమ్ములు పంచుకునేది కూడా కాదు. ఎంత దానం చేసినా తరగని నిధి అది. అటువంటి అక్షర జ్ఞాన నిధిని అందరూ సముపార్జించుకోవాలని ఆకాంక్షిస్తూ అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

ఒక కళాశాల,విశ్వవిద్యాలయం క్యాంపస్ లో ఒక కొత్తఆలోచన మెరుపులా మెరిసిందంటే అది కచ్చితంగా కలలు,కాగితాలు దాటి కళ్ళ ముందు కనిపించే ఆవిష్కరణ అవుతుంది. అది మరికొన్నిటికి ప్రేరణనిస్తుంది.

ఓ ప్రక్క ఫాషన్లు,సినిమాలు,సెల్ఫీలంటూ హడావుడిగా తిరుగుతున్నట్లు కనిపిస్తూనే చదువుల్లో దూసుకెళ్తూ, సమస్యల్ని శోధిస్తూ, పరిష్కారాల్ని సాధిస్తూ, కొత్త కొత్త ఆవిష్కరణల్ని చేస్తూ బాధ్యతతో ముందుకు వెళ్తున్న విద్యార్థులనుఅభినందిస్తున్నాను.

మీ శక్తి అంతా మీలోనే ఉందని, మీ మీద నమ్మకంలో ఉందని, ఆ నమ్మకం బలంగా ఉంటే విశ్వాన్నే జయించగలవనే...వివేకానందుని స్ఫూర్తిని అక్షరాల అందిపుచ్చుకొని ప్రతిభను చాటుతున్న విద్యార్థులు ఎంతోమంది ఉన్నారు. అటువంటి చైతన్యాన్ని స్ఫూర్తిని అన్ని రంగాల్లో ఉన్న విద్యార్థులూ అందుకుంటే జనాభాలో 40% ఉత్సాహం ఉరకలు వేసే యువత ఉన్న మన భారతదేశం మరింత శక్తివంతమవుతుందని తెలియజేస్తూ అందరికీ ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు!!

- ఆచార్య మొక్కా జగన్నాథరావు

# నేషనల్ అడ్వెంచర్ క్యాంప్ సెలక్షన్స్‌కు విశేష స్పందన



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నేషనల్ అడ్వెంచర్ క్యాంప్ 2022 యూనివర్సిటీ లెవిల్ సెలక్షన్స్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపుతూ ఉపన్యసించారు.భారతదేశ అభివృద్ధిలో యువత కీలక పాత్రను పోషించాలని అన్నారు.యువత (సి క్యూబ్ ఫార్ములాను) క్యారెక్టర్, కమ్యూనికేషన్, కమిట్మెంట్ లను అలవర్చుకోవాలని చెప్పారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో జరుగుతున్న నేషనల్ అడ్వెంచర్ క్యాంప్ 2022 యూనివర్సిటీ లెవిల్ సెలక్షన్స్ కు ఉమ్మడి గోదావరి జిల్లాల నుండి రెండు వందల మంది విద్యా ర్థులు హాజరయ్యారని తెలిపారు. నేషనల్ అడ్వెంచర్ క్యాంప్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్ అండ్ స్పోర్ట్స్ వారి ఆధ్వర్యంలో ధర్మశాల, హిమాచల్ ప్రదేశ్ లో అక్టోబర్ 3 నుండి 12వ తేదీ వరకూ క్యాంప్ జరుగుతుందని అన్నారు. దీనికి సంబంధించిన సెలక్షన్స్ లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాల నుండి ఎన్.ఎస్.ఎస్. వాలంటరీలను ఎంపిక చేస్తున్నారని చెప్పారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నుండి ఐదుగురు అబ్బాయిలు, ఐదుగురు అమ్మాలను ఎంపిక చేస్తారని తెలిపారు. సెలక్షన్స్ లో ఎంపికైన విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో నేషనల్ అడ్వెంచర్ క్యాంప్ లో నన్నయ విశ్వ విద్యాలయ ప్రత్యే కతను చాటిచెప్పే విధంగా ప్రతిభను కనపరచాలని సూచిం చారు. ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ డా.బి.కెజియారాణి మాట్లాడుతూ నేషనల్ అడ్వెంచర్ క్యాంప్ 2022 యూనివర్సిటీ లెవిల్ సెలక్షన్స్ ఆదికవి నన్నయ విశ్వవిద్యాల యంతో పాటు అనుబంధ




కళాశాలలైన ఆదిత్య, గైట్, డి.ఎన్.ఆర్ పాలకొల్లు, ఎస్.కె.ఎస్.డి. తణుకు, రాజ మహేంద్రి కాలేజ్, ఎస్.వి.కె.పి .పెనుగొండ, ఎస్.సి.ఐ.ఎం తణుకు, డి.ఆర్.జి. తాడేపల్లిగూడెం, ఎస్.వి.వి.ఎస్.డి. అన్నవరం నుండి విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో హాజరయ్యా రన్నారు. ఆంధ్ర ప్రదేశంలోనే ఎక్కువ యూనిట్లుతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్ విభాగం పని చేస్తుందని సహకరిస్తున్న వీసీకి ధన్యవాదాలు తెలియజేసారు. తరువాత విశ్వవిద్యాలయ క్రీడా ప్రాంగణంలో పరుగుపోటీలు, శరీర ధారడ్య పోటీలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేసారు. అనంతరం విద్యార్థుల కమ్యూనికేషన్ స్కీల్స్ పై ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ అధికారులు, ఫిజికల్ డైరెక్టర్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# ఐ క్యాంప్‌ను ప్రారంభించిన వీసీ



గౌతమీ నేత్రాలయం రాజమండ్రి ఆధ్వర్యంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఐ క్యాంప్ కార్యక్రమాన్ని వీసీ జగన్నాథరావు ప్రారంభించారు. సర్వేంద్రియానాం నయనం ప్రధానమన్నట్లు శరీరంలో అన్ని అవయువాల కంటే కన్ను ఎంతో ప్రధామైనదని, కంటిపై శ్రద్ధవహించాలని అన్నారు. నేటి కాలంలో ఎక్కువ మందికి కంటి సంబంధిత సమస్యలు అధికమవుతున్నాయని తెలిపారు. గౌతమీ నేత్రాలయం చేస్తున్న సేవలను అభినందించారు. గౌతమీ నేత్రాలయం అధినేత డాక్టర్ వి.కె.రాజు ప్రపంచంలోని 30 దేశాలలో కంటి సంబంధిత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. తరువాత వీసీ జగన్నాథరావు కంటిని డాక్టర్ వి.కె.రాజు పరీక్షించారు. విశ్వవిద్యాలయంలో మెగా క్యాంప్ జరుగుతుందని దీనిని ప్రాంగణ సిబ్బంది అంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.





జుడో క్రీడాకళనమూనాను పరిశీలిస్తున్న వీసీ జగన్నాథరావు




# వ్యర్థలోహాలతో అద్భుతమైన కళలు

## - నన్నయ మెకానికల్ ఇంజనీరింగ్ యాంత్రిక్ క్లబ్ విద్యార్థుల ప్రతిభ













ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ యాంత్రిక్ క్లబ్ ఆధ్వర్యంలో వ్యర్థలోహాలతో విద్యార్థులు చేసిన అద్భుతమైన కళలు అందరిని ఆకట్టుకున్నాయి. సృష్టిలో వ్యర్థమైనది ఏదీ లేదని అన్ని ఉపయోగమేననే అంశంతో స్క్రేప్ మెటల్ ఉపయోగించి ఆకట్టుకొనే వివిధ మానవ క్రీడ కార్యకలాపాలు, వాహనాలు మరియు జంతువుల నమూనాలను తయారు చేసారు. దీనికి సంబంధించిన విద్యార్థులు వేస్ట్ ఐరన్ బోల్ట్స్, నట్స్, గేర్స్, చైన్స్, బెరింగ్స్ వంటి మెకానికల్ ఐరన్ వ్యర్థాలను ఉపయోగించారు.

యూనివర్సిటీ సివిల్ మెకానికల్ ఇంజనీరింగ్ భవనంలో ప్రదర్శించిన వీటిని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తిలకించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్సిటీ మెకానికల్ ఇంజనీరింగ్ యాంత్రిక్ క్లబ్ విద్యార్థులు వెస్ట్ మెటీరియల్ ను ఉపయోగించి ఎంతో ప్రతిభవంతమైన కళారూపాలను తయారు చేసారని విద్యార్థులను ప్రశంసించారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ యాంత్రిక్ క్లబ్ ద్వారా చక్కని కార్యక్రమాలను నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, అధ్యాపకులు కె.హర్షరెడ్డి, యూనివర్సిటీ రిసెర్చ్ కన్సల్టెంట్ బి.దమయంతి జేసుదాస్ లను అభినందించారు. ఇంజనీరింగ్స్ డే రోజున అద్విక టెక్ ఫెస్ట్ లో ఈ కళారూపాలను ప్రదర్శించాలని తెలియజేసారు. యూనివర్సిటీలోని స్టూడెంట్ క్లబ్స్ అన్ని వినూత్నమైన కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థుల ప్రతిభను వెలికితీయాలని, వాటికి తగిన మార్గనిర్థేశాన్ని అధ్యాపకులు అందించాలని సూచించారు.


కళారూపాలతో యంత్రిక్ క్లబ్ సభ్యులు

మొదటి స్థానం – బైక్ – కె. ప్రవీణ్ (చివరి సంవత్సరం విద్యార్థి)
రెండవ స్థానం – హెలికాప్టర్ – జి.అనీల్ కుమార్, వై.వంశి, టి.సంతోష్ (తృతీయ సంవత్సరం)
మూడవ స్థానం – యుద్ధనౌక – ఎస్.తరుణ్, జె.గణేష్, ఎస్.జేమ్స్ (తృతీయ సంవత్సరం)

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in